# మార్పు

ఆషిష్ రాయ్‌చూర్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | మార్పు - ఓ తప్పని సరి ప్రక్రియ | 1 |
| 2. | మన ఉద్దేశాలు మరియు కోర్కెలలో మార్పు | 4 |
| 3. | మన ఆలోచన, వైఖరి, మాటలు మరియు ప్రవర్తనలలో మార్పు | 6 |
| 4. | ఊహించని మార్పులకై సిద్ధముగా ఉండండి | 8 |
| 5. | మార్పు-ముందుకు సాగిపోవుటకు మరియు అభివృద్ధి కొరకు తప్పనిసరియైనది. | 11 |
| 6. | మార్పు చెందించెడి ఆత్మ | 12 |

# 1
# మార్పు - ఓ తప్పనిసరి ప్రక్రియ

మార్పు ! మన చుట్టూ ఉన్నవన్నీ నిరంతరం మారుతున్నాయి. ప్రపంచం చుట్టూనున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మరియు ఇతర సామూహిక మార్పులను మనము చూస్తాము. విషయాలేవి అవి ఉండినట్లే నిలచిపోవు. “నేడు లోకంలో ఒక విషయం స్థిరంగా ఉన్నది–అదే మార్పు” ఇది ఓ సామాన్య నానుడి. ప్రస్తుతమున్న పరిస్థితులు భిన్నముగా అయ్యే ఒక సంఘటనను లేక క్రమక్రమముగా జరిగే వ్యత్యాసమును ‘మార్పు’ అనే మాట తెలియజేస్తుంది.

క్రైస్తవులకు కూడా మార్పు ప్రాముఖ్యమే! మన క్రైస్తవ జీవితం మారుమనస్సుతో ప్రారంభమౌతుంది, అనగా పాపము మరియు సాతాను నుండి మనస్సు మరియు హృదయము మారి సజీవుడైన దేవుని వైపుకు మరలుట అనే అవశ్యకమైన మార్పు. ఆ ఘడియలో దేవుడు మన అంతరంగమును మార్చాడు. మనము తిరిగి జన్మించాము! క్రీస్తు నందు మనము నూతన సృష్టిగా అయ్యాము, ఆ క్షణములోనే, దేవుడు మన ఆత్మలో సృజనాత్మక కార్యము జరిగించి మనల్ని అంధకారములో నుండి వెలుగులోనికి తీసుకొని వచ్చెను, సాతానుకు బానిసలుగా ఉండిన మనల్ని క్రీస్తునందు స్వతంత్రులను చేసెను. క్రైస్తవ జీవితం నిత్యము క్రమక్రమేణా మార్పు చెందే జీవితం. “తన కుమారునితో సారూప్యము గలవారవుటకు” (రోమా 8:29) దేవుడు మనల్ని ముందుగానే నిర్ణయించెను. నిరంతరం కొనసాగి క్రమక్రమేణా జరిగే మార్పు ద్వారా ఒక రకమైన ప్రజలమైన మనము రూపాంతర పరచబడి సంపూర్తిగా క్రీస్తువలె అగుదుము. ప్రభువైన యేసు తానే బూర శబ్దముతో పరలోకము నుండి దిగివచ్చి, ఒక రెప్ప పాటున మనమందరము మార్పు పొందే ఆ మహా రూపాంతర దినము కొరకు మనము ఎదురు చూస్తున్నాము (1కొరింథీ 15:51,52). క్షయత అక్షయతను ధరించుకొనును. “...ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము” (1యోహాను 3:2).

తత్క్షణ మార్పుతో ప్రారంభమయిన క్రీస్తునందు మన జీవితం, రెప్పపాటులో మార్పునొందే వేరొక ఉన్నత సంఘటనా స్థితిని చేరుకుంటుంది. ఏమైనను, నిత్యము కొనసాగే మార్పు అనే ప్రక్రియ ఈ రెండు అంశాల మధ్యే ఉంటుంది. ఈ పుస్తకము ఈ అంశముపైనే కొనసాగుతుంది, మరిముఖ్యముగా మనల్ని ప్రోత్సాహించుటకు మరియు మార్పు యొక్క నిరంతర క్రమములో ఉత్సాహముగా పాల్గొనుటకు మనల్ని

ప్రేరేపించుటకు ఇది ఉద్దేశించబడినది. మార్పు యొక్క ప్రక్రియకు లోబడవలసిన మన జీవిత పరిధులను కూడా మనం గమనిద్దాం.

**“మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచు (మారుచు), ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము”** (2కొరింథీ 3:18)

మన దృష్టి ప్రభువు మీద కేంద్రీకరించిన యెడల, అప్పుడు మనము ఆయన స్వరూపములోనికి మార్చబడుట అనే పరిణామమును ఏదీ నిరోధించలేదు. వాస్తవానికి, మనమాయన దగ్గరికి సమీపించిన కొలదీ మరియు ఆయన మహిమలో మరింత లోతుకు వెళ్ళుచున్న కొలదీ, మన జీవితాల్లో మార్పునొందవలసిన పరిధులను మరింతగా గుర్తించడం ప్రారంభిస్తాము. పై వాక్యములో మనము “మార్చబడుచున్నాము” (వర్తమాన కాలములో నున్న ఈ పదం క్రమక్రమముగా కొనసాగు క్రియను తెలుపుచున్నది). మనము మార్చబడుచున్నట్లుగానే, మనము మహిమ నుండి అధిక మహిమకై ముందుకు కొనసాగుచున్నాము. కాబట్టి ఒక స్థాయి నుండి వేరొక స్థాయిలోనికి వెళ్ళుటకు మార్పు తప్పనిసరి ప్రక్రియైయున్నది. ఈ విషయమే ఆత్మీయ ఎదుగుదలను లేక క్రమాభివృద్ధిని తీసుకు వస్తుంది. మార్పు లేకుండా ఎటువంటి ఆత్మీయ ఎదుగుదల కలుగదు. ఎందుకంటే ఎదుగుదల అనేది దానికదే మార్పు యొక్క ప్రక్రియైయున్నది. తన పిల్లలలో ఏ ఒక్కరూ దీర్ఘకాలంగా ఒకే ఆత్మీయ స్థితిలో ఆగిపోవాలనేది దేవుని కోరిక కాదని మనము నమ్ముచున్నాము. దానికన్నను, మనము ముందుకు సాగుతుండాలనే ఆయన కోరుతున్నాడు. మనము ప్రవహింపని నీళ్లవలె నిలచిపోవాలని దేవుడు కోరుటలేదు.

మార్పు మన ఆత్మీయ జీవితాల విషయానికి మాత్రమే కాక, మన అనుదిన జీవిత ఉనికిలో ప్రతీ దృష్టికోణంలోనూ ఇది సాక్ష్యార్థం కావాలి. మన వ్యక్తిత్వం, ప్రవర్తన, బుద్ధి కుశలత, నైపుణ్యతలు, సామర్థ్యాలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రణాళికలు, లక్ష్యాలు మరియు మొదలగు వాటన్నింటిలోనికి మనము మార్పును ఆహ్వానించాలి. మన జీవితంలో ప్రతి పరిధిలో “మహిమ నుండి మహిమకు” వెళ్ళుటకై కృతనిశ్చితమైన మరియు జ్ఞానపూర్వకమైన ప్రయాస తప్పనిసరి. భూమిపై మన జీవిత మందలి ప్రతీ అంశములోను దేవుడు ఆసక్తి కలిగియున్నాడు—విద్య, జీవిత భవిష్యత్తు, కుటుంబం, వృత్తి మరియు పరిచర్య. మనము పనిచేయుటకు ఈ ప్రతి అంశము యొక్క పరిధిలో ఇంకా ఉత్తమమైన, ఉన్నతమైన స్థితిని చేరుటకు కష్టపడాలి.

మార్పు

ఉదాహరణకు మీరొక విజయవంతమైన డాక్టర్‌గా ఉంటే, మీరింకా ఉత్తమమైన వారిగా అగుటకై ప్రయాసపడగలరు. బహుశా వైద్య సదుపాయము లేక చికిత్స అందుబాటులో లేనివారికి నూతన మార్గాల ద్వారా సహాయాన్ని అందించే దానిని గూర్చి ఆలోచించవచ్చు. మీ గత ప్రణాళికలో భాగమైయుండని నూతన కార్యములను చేయుట గూర్చి మీరు ఆలోచించవచ్చు. ఓ విద్యార్థిగా, మీ జ్ఞానాన్ని మరియు ప్రతిభను మెరుగు పరచుకొనుటకు ప్రయాసపడ వచ్చును. ఓ గృహిణిగా, మీ కుటుంబము పట్ల వహించే జాగ్రత్త మరియు వారికందించే సదుపాయముల నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రయత్నించవచ్చు. ఒక సేవకునిగా, మీ ప్రశంగ శైలిని మరియు లక్షణాలను మెరుగుపరచుకొనుటకై ప్రయాసపడవచ్చును. ఏమైనను, మనము "మార్పు" నొందుటకు ఇష్టపడినప్పుడు మాత్రమే వీటిలో ప్రతి ఒక్కటి సాధ్యమౌతుంది. రాబోయే అధ్యాయాలలో, మార్పు యొక్క కొన్ని పరిధులను మనము పరిశీలిద్దాం.

మన దృష్టి ప్రభువు మీద కేంద్రీకరించిన యెడల, అప్పుడు మనము ఆయన స్వరూపములోనికి మార్చబడుట అనే పరిణామమును ఏదీ నిరోధించలేదు. వాస్తవానికి, మనమాయన దగ్గరికి సమీపించిన కొలదీ మరియు ఆయన మహిమలో మరింత లోతుకు వెళ్ళుచున్న కొలదీ, మన జీవితాల్లో మార్పునొందవలసిన పరిధులను మరింతగా గుర్తించడం ప్రారంభిస్తాము.

# 2
# మన ఉద్ధేశాలు మరియు కోర్కెలలో మార్పు

**"దేవా, నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము నా అంతరంగములో స్థిరమైన (సరియైన) మనస్సును నూతనముగా పుట్టించుము"** (కీర్తన 51:10)

మన అంతర్గత ఉద్దేశాలు మరియు కోర్కెలు అత్యంత ప్రాముఖ్యమైనవి. ఎంతో ఆత్మీయమైన మరియు చక్కని గ్రహింపు కలిగిన క్రైస్తవులు సహితం కొన్ని విషయాల పట్ల తప్పుడు ఉద్దేశాన్ని లేక కోరికను కలిగియుంటారని మనము గమనించాలి. అటువంటి దుష్టత్వమునకు విరుద్ధమైన స్వభావము మనలో ఏ ఒక్కరిలోనికి దానంతట అదే చొప్పించబడలేదు గాని, దానికి బదులు ఇట్టి దుష్టత్వమునకు వ్యతిరేకముగా నిరంతరం జాగ్రత్తగా కనిపెట్టుకొని యుండవలెను. "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటి కంటే ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము" (సామె 4:23) అని ప్రభువు హెచ్చరించుచున్నాడు. దురుద్దేశములచే మన హృదయం చెరపట్టబడకుండా కాపాడుకొనే బాధ్యత మనపై నున్నది. మన హృదయాలను పరిశీలించి, నిజముగా లోపల ఉన్న అటువంటి ఉద్దేశాలు మరియు కోర్కెలను గుర్తించుటలో ఏ మాత్రము తప్పులేదు. ఇది మార్పుపట్ల ప్రాధమికమైన మరియు ప్రాముఖ్యమైన అడుగు. మనల్ని మనం పరీక్షించుకొనవలెనని లేఖనం పదేపదే ఘోషిస్తున్నది.

**"కాబట్టి ప్రతీ మనుష్యుడు తన్నుతాను పరీక్షించుకొనవలెను, ఆలాగు చేసి ఆ రొట్టెను తిని, ఆ పాత్రలోనిది త్రాగవలెను"** (1 కొరింథీ 11:28)

**"అయితే మనలను మనమే విమర్శించుకొనిన యెడల తీర్పు పొందక పోదుము"** (1కొరింథీ 11:31)

**"మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి, మిమ్మును మీరే పరీక్షించుకొనుడి, మీరు భ్రష్టులు కానియెడల యేసుక్రీస్తు మీలో నున్నాడని మిమ్మును గూర్చి మీరే యెరుగరా?** (2కొరింథీ 13:5)

## పరిచర్యలోని ఉద్దేశాలు :

తప్పుడు ఉద్దేశములను మరియు కోర్కెలను గుర్తించిన తరువాత మనము వాటిని ఒప్పుకొని మనల్ని మార్చుమని ప్రభువును అడగాలి. "దేవా, నాయందు

శుద్ధ హృదయము కలుగజేయుము నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము" అని దావీదు ప్రార్థించినట్లు ప్రార్థించండి. వ్యక్తిగతంగా, ప్రజలకు పరిచర్య చేయుచుండగా, వివిధ పరిధులలో ఉండే తప్పుడు ఉద్దేశముల నుండి మన సొంత జీవితాన్ని నిరంతరము మనం కాపాడుకోవాలి. "నేను దీనినెందుకు చేస్తున్నాను?" నా ఉద్దేశం ఏమిటి? నా యదార్థమైన కోరిక ఏమిటి?" అని మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. ఉదాహరణకి, ఒక స్థలంలో పరిచర్య చేయుటకు మనం పిలువబడిన యెడల, అక్కడకు వెళ్లుటకు మన హృదయాలను సిద్ధపరచి మనకు పవిత్ర ఉద్దేశాన్ని అనుగ్రహించమని మనము ప్రభువును తప్పక అడగాలి. వారు మన పరిచర్యకై ఇచ్చే కానుకపై దృష్టి కేంద్రీకరించకుండా మన హృదయాలను కాపాడుకోవాలి. దేవుని అతీతమైన శక్తి మరియు ప్రేమలను మనము ఆశించుచున్నప్పుడు గొప్ప అభిషేకమున్న దైవ సేవకుడిగా గుర్తించబడాలనే చెడు తలంపు నుండి మన హృదయాలను కాపాడుకోవాలి. మనము పరిచర్యలో ఎదుగుటకై వెదకుచుండగా, మన సొంత 'పరిచర్య'ను లేక 'రాజ్యాన్ని' అభివృద్ధి చేసుకోవాలనే కోరిక నుండి మన హృదయాలను కాపాడుకోవాలి. ఇది 'నా పని కాదు దేవుని పనియని' మరియు ఇది 'నా రాజ్యం కాదు దేవుని రాజ్యమని' మనకు మనం అనునిత్యం గుర్తు చేసుకొనుచుండాలి.

పరిచర్యలో 'కనిపెట్టుట' యొక్క ప్రాముఖ్యతను నేను చక్కగా కనపరచాను. ఎందుకనగా మన ఉద్దేశాలు మరియు కోరికలు మన జీవితాలలో అనేక విషయాలపై ప్రభావము చూపిస్తాయి మరియు దిశను నిర్ధారిస్తాయి. వీటన్నింటికి మిన్నగా, మనం బయటకు వ్యక్తపరిచే హావభావాలు వెనుక మన అంతరంగమందున్న వాటిని దేవుడు చూస్తాడు. "మనుష్యులు లక్ష్యపెట్టు వాటిని యెహోవా లక్ష్యపెట్టడు ...మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు కాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1సమూ 16:7). దేవుడు అంతరంగములో సత్యమును కోరుచున్నాడు (కీర్తన 51:6). మీ ఉద్దేశాలు మరియు కోర్కెలను అనునిత్యం జాగ్రత్తగా కనిపెడుతూ ఉండండి. ఒకవేళ అవి సరియైనవి కాకపోతే, ప్రభువు దగ్గరకు వెళ్ళి మిమ్మల్ని మార్చమని అడగండి !!

దురుద్దేశములచే మన హృదయం చెరపట్టబడకుండా
కాపాడుకొనే బాధ్యత మనపై నున్నది.

# 3

# మన ఆలోచన, వైఖరి, మాటలు మరియు ప్రవర్తనలలో మార్పు

**"మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక.... మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి"** (రోమా 12:2)

**"మీ చిత్తవృత్తి (మనోః వైఖరి) యందు నూతనపరచబడినవారై"** (ఎఫెసీ 4:23)

**"యౌవనమును బట్టి ఎవడును నిన్ను తృణీకరింపనియ్యకుము గాని, మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము"** (1తిమోతి 4:12)

ప్రభువు మన ఆలోచన మరియు వైఖరిలో మార్పును చూడగోరుచున్నాడు. "మన మనస్సులు నూతనపరచుకొనుట" (రోమా 12:2) అనేది మన ధృక్పధాలలో, మన వైఖరిలో మరియు ఆలోచనలలో మార్పు పొందవలెనని సూచిస్తుంది. ఈ పదానికి ఇంకా అనేక కోణాలున్నాయి. 'లోకపరమైన' విధానాలను కలిగియుండుట లేక 'లోకపరమైన ఆలోచనలు' ఆలోచించుట నుండి మనము మార్పునొంది దేవుని ఆలోచనల్ని మరియు విధానములను ధరించుకొనవలసి యున్నది. 'హీనమైన ఆలోచన విధానము నుండి మనము విముక్తి చెంది దేవుని వాక్య సామరస్యత నందు మరియు విశ్వాసము యొక్క స్థిరస్థానము నుండి ఆలోచించుటకు మన ప్రమాణికతలను పెంచుకొనవలసి యున్నది. మనలో కొందరు, 'జరగనే జరగదు' అనే విరుద్ధ స్వభావమైన నిరాశవాదమును విడిచిపెట్టి దేవుని యందలి సామాన్య విశ్వాసము ద్వారా సాధ్యమయ్యే గొప్ప అవకాశములను చూచుట ప్రారంభించాలి. స్వయాన ప్రభువే "నూతనమైన మరియు సరిక్రొత్త" రీతిలో కార్యాలు జరిగించమని కోరినా దానిని అంగీకరించుటకు మనలో కొందరు సముఖత చూపక 'పాత రీతి'లోనే కార్యాలను జరిగించుటలో చాలా లోతుగా 'పాతుకుపోయారు'. మనకు బోధించబడిన రీతిలో తప్ప దేవుడు వేరొక రీతిలో క్రియ చేయడని భ్రమపడునట్లుగా మన ఆలోచన వైఖరి మత ఆచారములతోను మరియు పద్ధతులతోను బహుగా బంధింపబడింది.

మరి కొందరి కలలు చాలా చిన్నవి, ఆశలు చాలా తక్కువ స్థాయి గలవి, దర్శనాలు అంత స్పష్టమైనవి కావు. ఈ పరిధులలో వారు మార్పును చూడాలి.

మన కలలు పెద్దవిగా ఉండాలి, దేవుని కొరకు ఇంకా ఎంతో సాధించాలనే ఆశ ఉండాలి. మరియు లోకములో ఒక మార్పును కలుగజేసే గొప్ప దర్శనాలను కలిగియుండాలి. మనలో కొందరు ఓటమి అనుభవాలు, వైఫల్యం, నిరుత్సాహము లేక విపత్తుల కారణాన్న నిరాశ లేక నిస్పృహ అనే నిర్వీర్య స్థితిలోనికి పడిపోయారు. చలనములేదు, ప్రేరణలేదు, క్రమక్రమాభివృద్ధి లేక ఎదుగుదల కొరకైన ప్రయాస ఏమీ కనబడుటలేదు. మనము గాని దేవునికి మన తరపునుండి చిన్న సహకారము (సముఖత) అందించుటకు ఇష్టపడితే ఆయన వాటన్నిటిని మార్చగలడు! కొందరు బహుశా కేవలం బద్ధకస్తులుగా, బహుగా వెనుకబడిన వారిగా, నిరుత్సాహవంతులుగా ఉండవచ్చు. మన వైఖరి విషయంలో మనకొక వేగవంతమైన మార్పు అవసరం!! కొందరు అన్నీ జరిగిపోయిన తరువాత మేలుకొనే స్వభావం గలవారై యుండవచ్చు, వారు దానిని మార్చుకోవాలి. కొందరు ప్రణాళికలు వేయటం మరియు మాటలు మాట్లాడం తప్ప "నాగటిపై తమ చేయి వేయరు" ఇది కూడా మారాలి. కొందరు భయం, గర్వం, కక్షతో బంధించబడి యుంటారు లేక దేవునికి ఇష్టము కాని వ్యక్తిత్వ లక్షనాలను కలిగియుంటారు, అది మార్చబడుటను ఆయన చూడగోరుచున్నాడు. దేవుడు మనల్ని మాటలోను మరియు ప్రవర్తనలోను ఉన్నత స్థానాలలోనికి హెచ్చించాలని ఆశించుచున్నాడు. మన మాట మరియు ప్రవర్తన అవి ఒక విశ్వాసికి తగినట్టుగా ఉండాలి.

వ్యక్తిగతంగా మన సొంత జీవితాల్లో తప్పుడు ఆలోచనలు లేక వైఖరి పట్ల మనము మెళకువ కల్గినవారమై, మనము ప్రభువు యొద్దకు వెళ్ళాలి, ఆయన ఎదుట వాటిని ఒప్పుకొని, ఆయన మనల్ని మార్చునట్లు ప్రార్థించాలి. ప్రభువుతో అనేక సంవత్సరములు నడచిన తరువాత సహితం ఇంకా మన జీవితంలో మార్పు చెందవలసిన పరిధులను కనుగొంటాము. నీ స్వంత జీవితంలోని వైఖరులను మరియు ఆలోచన విధానాలను గుర్తించి వాటిని దేవుని యొద్దకు తీసుకువచ్చి "ప్రభువా నా జీవితంలో ఇవి మార్చబడుటను చూడాలి" అని ప్రార్థించగలవా?

> 'లోకపరమైన' విధానాలను కలిగియుండుట లేక లోకపరమైన ఆలోచనలన ఆలోచించుట నుండి మనము మార్పునొంది, దేవుని ఆలోచనలను మరియు విధానములను ధరించుకొనవలసియున్నది.

# 4

# ఊహించని మార్పులకై సిద్ధముగా ఉండండి

**"గాలి తన కిష్టమైన చోటను విసరును, నీవు దాని శబ్ధము విందువే గాని అది ఎక్కడ నుండి వచ్చునో ఎక్కడికి పోవునో నీకు తెలియదు. ఆత్మ మూలముగా జన్మించిన ప్రతివాడును ఆలాగే యున్నాడనెను"** (యోహాను 3:8)

ఆత్మ మూలముగా జన్మించుటననునది పూర్తిగా వివరింప శక్యంకాని జీవితంలోనికి మనల్ని నడిపించుచున్నది. కొన్ని విషయాలు కేవలం అప్పగించుకొని అనుభవించవలసి ఉంటుంది. ఆత్మ ద్వారా తీసుకురాబడిన నూతన జన్మను దానికి ఇష్టము వచ్చిన చోటికి వీచే గాలితో ప్రభువైన యేసు సమాంతర పరిచెను. మనము దీనిని కేవలం అనుభవిస్తాము అంతే! దీని నిజ ఆవిర్భావము లేక గమ్యమును మనమెరుగము. అట్టి రీతిగానే, ఆత్మ యొక్క అనేక క్రియలు కూడా పూర్తిగా వివరింపబడజాలవు. మనము కేవలం ఆయన జరిగించిన దానిని తెలుసుకొని అనుభవిస్తాము. ప్రభువు కొన్ని సమయాల్లో, కొన్ని సంఘటనలను మరియు పరిస్థితులను మన జీవితంలోని వరుస క్రమంలో రప్పించవచ్చు, ఇవి మనకు పూర్తిగా ఊహించని విషయాలు కావచ్చు. ఇటువంటి సంగతులను ఎదుర్కొంటామనే తలంపు కూడా మనము కలిగియుండం. అవి మన యోచనలోని ఒక భాగమే కాదు. అయినప్పటికీ ప్రభువుకు అప్పగించుకొనుట మరియు 'గాలి ఎక్కడికి వీస్తే అక్కడికి కొనిపోబడుటకు' యిష్టపడుటయే బుద్ధిపూర్వకమైన పని. ప్రభువు మన జీవితాల్లోనికి తీసుకొని వచ్చే ఊహించని మార్పులకై తెరువబడి యుండుటను నేర్చుకొనుట బహు ప్రాముఖ్యమైనది. ఇవి మన జీవిత విజయాలకు మలుపులు కావచ్చు.

## మా పరిచర్యలో మార్పు :

దేవుడు మా కొరకు నిల్వచేసిన వాటిలోనికి మేము నడచుటకుగాను ఊహించని మార్పులను ఆయన ఏ విధంగా వినియోగించాడో నేను నా భార్య పలు విషయాలను తిరిగి జ్ఞాపకానికి తెచ్చుకొనగలం. 1995 సం॥లో నా తండ్రి వ్యాపార వ్యవహారాల నిమిత్తం అమెరికా వచ్చారు. మేము నివసిస్తున్న ప్రాంతమైన న్యూ బ్రున్స్‌విక్, న్యూజెర్సి ప్రాంతంలో ఒక రాత్రి గడిపి మమ్మల్ని చూడాలని నిర్ణయించుకున్నారు. అతను

శనివారము వచ్చారు, మరలా ఆదివారం సాయంత్రం ప్రయాణమవుతారు. అయితే ఆఫ్రిక–అమెరికన్ల సంఘాన్ని దర్శించాలని అతనెప్పుడూ కోరుకొనేవాడు ఎందుకంటే వారి పాటలను మరియు ఆరాధనా శైలిని ఆస్వాధించాలని అతని కోరిక. మాకు దగ్గరలో ఒక ఆఫ్రికా అమెరికన్ల సంఘం ఉంది కాబట్టి ఆదివారం ఉదయం మేము అక్కడకు వెళ్ళాము. నేనంతకు మునుపెన్నడూ అటువంటి కంపింపజేసే మరియు లోపలనుండి అప్పటికప్పుడు వచ్చే పాటలను పాడటాన్ని చూడలేదు లేక అనుభవించలేదు. ఇదంతా బిగ్గరగాను, చెవులు హోరెత్తి పోయినట్లు మరియు బిల్డింగ్ కుప్పకూలిపోతుందేమో అన్నట్లు అనిపించింది. మొత్తానికి నాకు అలా అనిపించింది. ఆ సమయం వరకు, నేను యూనివర్సిటీలోని కొరియా—అమెరికా సహోదరి సహోదరులతో సహవాసము కలిగి పరిచర్య చేయుచున్నాను. మేము దేవుని స్తుతించుటలో స్వాతంత్ర్యమును కలిగి ఉన్నాం. అయినను ఇది నేను సాక్ష్యమిస్తున్నటు వంటిది కాదు. అప్పుడు నా మనస్సులో కొన్ని వేవేల ఆలోచనలు పరుగులు తీసాయి. అట్టి ఆరాధన సరియైనదని నా లోపల నాకు లోతుగా తెలుసు. నేనెల్లప్పుడు ప్రభువుకు స్తుతి ఆరాధనను స్వతంత్రంగా వ్యక్తపరచాలని కోరుకునేవాన్ని. కాని ఆఫ్రికా–అమెరికన్ల సంఘంలో జరిగిన దానితో పోల్చగా, నేను నివ్వెరపోయాను, కఠినంగా కనబడ్డాను. ఆ తరువాత రోజు నేను ఒంటరిగా ఉన్నప్పుడు, నేను చాలా గలిబిలికి గురైనట్లు కనబడ్డాను. నాలో ఒక భాగం ఇలా చెప్పింది "ప్రభువా నేను మరలా అక్కడికి వెళ్ళాలనుకొనుటలేదు, నేనెన్నటికీ వారివలె కాలేను, ఆ శబ్ధ స్థాయిని నేను భరించలేను". నాలోని వేరొక భాగం "దేవా వారు కలిగియున్నది నిజంగా నాకు కావాలి–నిన్ను ఆరాధించుటకు నాకు అట్టి స్వాతంత్ర్యం కావాలి" అని చెప్పింది. అయితే, దీనిని సంగ్రహించుటకు నేను మరలా అక్కడికి వెళ్ళాను. కొద్దికాలంలోనే నాకు పరిచర్య చేయుటకు అవకాశమివ్వబడింది, ఆ సంఘంలో ప్రతి బుధవారం రాత్రి కూడికలో పరిచర్య చేసాము. అక్కడ మేము మంచి ఆఫ్రికా–అమెరికా సహోదరి సహోదరులను కలుసుకొనగలిగాం. అక్కడకు వచ్చే స్పెయిన్ దేశస్థులైన మాన్యుల్ మరియు టానియా అనే దంపతులను కూడా కలుసుకున్నాం. తరువాత వారు స్థాపిస్తున్న స్పెయిన్ భాష మాట్లాడే సంఘంలో పరిచర్య చేయుటకై ఆహ్వానించబడ్డాం. అటు తరువాత ఆ స్పానిష్ సంఘంతో మా జీవితాన్ని అధికంగా పంచుకొనుట ప్రారంభించాము. వాక్యాన్ని అధ్యయనం చేసేందుకు మాన్యుల్ మరియు టానియాలు వారంలో ఒక నిర్ణయ సమయాన్ని మాతో గడిపేవారు. నా భార్య ఆమి ఆ స్పానిష్ సంఘములో సంగీత పరిచర్యలో సహాయమందిస్తూ ఉండేది. మరియు మేము వారి సహాయంతో నవంబర్, 1996లో

పరిచర్య నిమిత్తం ఈక్వెడార్‌కు వెళ్ళగలిగాము. నా తండ్రి న్యూ బ్రున్స్‌విక్‌లో ఒక్క రాత్రి బసచేయుట ద్వారా కలిగిన గొలుసు సంఘటనలను చూడండి!! ఇదంతా ఊహించనిదేనా? అవును ఎంతో నిశ్చయంగా!! మేమైనా దీనిని యోచించామా? అసలు కానేకాదు!! ఆత్మ గాలి ఎటు వీస్తుందో కేవలం అటు వెళ్ళుటను నేర్చుకున్నాం. ఆఫ్రికా-అమెరికన్ లేక స్పానిష్ సమాజముల వారికి పరిచర్య చేస్తామని మేమెన్నడూ ఊహించలేదు. ఆయన ఎటు వీస్తే మనం అటు వెళ్ళాలి!! దేవుడు మీ జీవితాల్లోకి తీసుకురాదలచిన ఊహించని మార్పుల కొరకై సిద్ధముగా ఉండండి మరియు తెరువబడినవారై ఉండండి.

- ప్రభువు కొన్ని సమయాల్లో, కొన్ని సంఘటనలను మరియు పరిస్థితులను మన జీవితంలో వరుస క్రమంలో రప్పించవచ్చు, ఇవి మనకు పూర్తిగా ఊహించని విషయాలు కావచ్చు.
- అయినప్పటికీ, 'ప్రభువుకు అప్పగించుకొనుట' మరియు 'గాలి ఎక్కడికి వీస్తే, అక్కడికి కొనిపోబడుటకు' యిష్ట పడుటయే బుద్ధిపూర్వకమైన పని !
- ప్రభువు మన జీవితాల్లోనికి తీసుకొనివచ్చే ఊహించని మార్పులకై తెరువబడి యుండుటను నేర్చుకొనుట బహు ప్రాముఖ్యమైనది. ఇవి మన జీవిత విజయాలకు మలుపులు కావచ్చు.

# 5

# మార్పు - ముందుకు సాగిపోవుటకు మరియు అభివృద్ధి కొరకు తప్పని సరియైనది

**"గోధుమ గింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును, అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును"** (యోహాను 12:24)

మనము మహిమ నుండి మహిమకు మార్చబడ్డాము. కాబట్టి నేడు మనము అనుభవించుచున్న మహిమ యొక్క స్థాయి నుండి దాని తరువాత స్థాయికి వెళ్ళుటకు, మొదట మనము మారాలి. ముందుకు సాగనియ్యక మనల్ని అడ్డగిస్తున్న మరియు నిలిచిపోజేస్తున్న—అవి మన ఉద్దేశ్యాలు, వైఖరి, ప్రవర్తన లేక మాటతీరు కావచ్చు, ఇవి తప్పక మారాలి.  మనము పైకి లేచి అసలు ఈ సంగతులేమైయున్నాయో గుర్తించి దేవుని సహాయముతో వాటిని మార్పు చెందించాలి. నేడు మనమున్న స్థితిని సాదృశ్య రూపకముగా చూపబడిన "గోధుమ గింజ" వలె తలంచ వచ్చును. మనము "విస్తారముగా ఫలించే" అభివృద్ధి అయ్యే స్థితిలోనికి అడుగిడదలచినచో మొదట మనం తప్పక "భూమిలో పడాలి" "చనిపోవాలి" అంతట "విస్తారముగా ఫలించాలి".  మనలో క్రమక్రమముగా జరిగే మార్పును  ఇది సాదృశ్యముగా కనపరుస్తుంది. మొదట మనం భూమిలో పడాలి దీనికి గాను తగ్గింపు అవసరం. మనము మారల్సిన అవసరత ఉంది అనే వాస్తవాన్ని అంగీకరించుటకు గాను మన తరపు నుండి తగ్గింపు అవసరం. స్వార్థం విషయంలో మనము తప్పక మృతి చెందాలి. కొన్ని సమయాల్లో ఇది చాలా బాధాకరమైనది కాగలదు. అప్పుడు మనము ముందుకు కొనసాగిపోవుటను మరియు అభివృద్ధి చెందుటను అనుభవిస్తాము. మహిమ యొక్క ఒక స్థాయి నుండి వేరొక స్థాయిలోనికి మనం లేపబడతాము.

ముందుకు సాగనియ్యక మనల్ని అడ్డగిస్తున్న మరియు నిలిచిపోజేస్తున్న-అవి మన ఉద్దేశాలు, వైఖరి, ప్రవర్తన లేక మాటతీరు కావచ్చు, ఇవి తప్పక మారాలి.

# 6
# మార్పు చెందించెడి ఆత్మ

**“ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను. భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను, చీకటి అగాధ జలముపైన కమ్మియుండెను. దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను. దేవుడు–వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను”** (ఆది 1:1–3)

ప్రభువు ఆత్మ మనల్ని మహిమ నుండి అధిక మహిమకు మార్చును. పరిశుద్ధాత్ముడే ఆ మార్పుకు కారకుడు. భూమి నిరాకారముగాను, శూన్యముగాను మరియు చీకటిగా నుండెను. అయితే దేవుని ఆత్మ జలములపై అల్లాడుచుండెను. “వెలుగు కలుగును గాక” అని దేవుడు పలుకగానే దేవుని శక్తివంతమైన పరిశుద్ధాత్మ ఆ చీకటి మధ్యలోనికి వెలుగును తెచ్చెను. దేవుడు సృజనాత్మక మరియు సమకూర్పు మాటలను పలికే సమయంలో, ఈ నిరాకారమైన, చీకటి మరియు శూన్యమైన భూమి యొక్క ఉపరితలంపై దేవుని ఆత్మ పొదుగుచున్న దనుటకు ఇది సూచనయై యున్నది. పరిశుద్ధాత్ముడే ఆ మార్పు చెందించెడి ఆత్మ అని మనము నమ్ముచున్నాము. ఆయనే మార్పును మరియు రూపాంతరతను తీసుకొని వచ్చువాడు. భూమి యొక్క ఉపరితలం సమకూర్చబడినప్పుడు ఆయన దీనిని అధిక మోతాదులో చేసెను (ఆది 1). మనము కూడా ఆయన దృష్టికి మంచిదిగా కనబడులాగున, దేవుని మహిమతో మనల్ని నింపి మరియు మనల్ని రూపాంతరపరచుట కొరకు ఆయన మనలో ఇంకెంత అధికముగా క్రియ చేయవలెనని మనము ఆశించగలము. మనము ఏ మేరకు ఆయనకు అప్పగించుకుంటామో ఆ సరిహద్దు వరకు మాత్రమే ఆయన మనలో క్రియ చేస్తాడు. మీ హృదయాన్ని పరిశుద్ధాత్మునికై తెరచి ఉంచండి. మిమ్మల్ని మీరు ఆయనకు సమర్పించుకొని మిమ్మల్ని మార్చమని ఆయనను అడగండి. మీ జీవితంలో ఇంకా మార్పు చెందవలసిన పరిధులతో కార్యము సలుపుటకు సహాయము చేయమని ఆయనకు ప్రార్థించండి.

## దేవుని వాక్యము మార్పును తెస్తుంది:

దేవుని సృజనాత్మక మరియు సమకూర్పు క్రియలో కేవలం పరిశుద్ధాత్ముడు మాత్రమే శూన్యమైన భూమిపై అల్లాడలేదు గాని చీకటిపైన మరియు శూన్యము

పైన దేవుని వాక్యము కూడా పలుకబడింది (ఆది 1). అట్టి రీతిగానే ఆత్మ మరియు వాక్యము రెండూ కలిసి మన జీవితాల్లోనికి తగు మార్పులను తీసుకు వస్తాయి. దేవుని వాక్యానికి మీ హృదయాన్ని మరియు మనస్సును తేటతెల్లము చేయండి. మీకు మీరే వాక్యాన్ని చదివి దానిని ధ్యానించండి. అప్పుడు దేవుని వాక్యం దాని రూపాంతర శక్తిని మీ జీవితంలోనికి విడుదల చేయుటను ప్రారంభిస్తుంది.

మీ హృదయాన్ని పరిశుద్ధాత్మునికై తెరచి ఉంచండి. మిమ్మల్ని మీరు ఆయనకు సమర్పించుకొని, మిమ్మల్ని మార్చమని ఆయనను అడగండి. మీ జీవితంలో ఇంకా మార్పు చెందవలసిన పరిధులలో కార్యము సలుపుటకు సహాయము చేయమని ఆయనని ప్రార్థించండి.

# ఓ ప్రార్థన

## దేవా, నన్ను మార్చుము !

ప్రియ తండ్రీ ! యేసు నామములో నేను నీ యొద్దకు వచ్చుచున్నాను. ప్రభువా, నా జీవితంలో నేను చూసే కొన్ని విషయాలు మార్పునొంద వలసి యున్నవి. ప్రభువా నీ ఆత్మ మరియు వాక్య శక్తిచే నన్ను మార్చుము. నేను ప్రస్తుతమున్న స్థితినుండి నీవు నన్నెక్కడ ఉండమని కోరుచున్నావో ఆ స్థితికి వెళ్లాలని కోరుచున్నాను. నేను ఏమి అవ్వవలెనని నీవు ఇచ్ఛయించుచున్నావో అట్టి రీతిగా అగుటకు ఇష్టపడుచున్నాను. నా కొరకు నీవు దాచియుంచిన వాటన్నింటిని నేను పొందుకోవాలని కోరుచున్నాను. నా ఉద్దేశాలను, వైఖరిని, మాట తీరును మరియు ప్రవర్తనను మార్చండి. దైవిక విషయాలలో నేను ముందుకు సాగకుండా మరియు అభివృద్ధి చెందకుండా అడ్డగిస్తున్న విషయాలన్నింటి నుండి నేను విముక్తి చెందుటకు సహాయం చేయండి. ఆమెన్.

# ఆల్ పీపుల్స్ చర్చ్ గురించి

బెంగుళూరు పట్టణానికి ఉప్పుగాను మరియు వెలుగుగాను ఉండాలని మరియు భారత దేశానికి మరియు ఇతర దేశాలకు దేవుని స్వరముగా ఉండాలనునది ఆల్ పీపుల్స్ చర్చ్ యొక్క దర్శనం.

ఇది మీకు మేమందిస్తున్న ఒక బహుమానం! ఇది ఉచితం!

ఈ పుస్తకాన్ని చదువుట ద్వారా మీరు ఆశీర్వదింపబడ్డారని మేము నమ్ముచున్నాము.

మీ వలె కొన్ని వేలమందికి ఈ పుస్తకాలు ఉచితముగా పంచబడ్డాయి. దేవుని వాక్యమును అనేకులతో పంచుకొనుటకు గాను, మీరు ఆర్థికంగా సహాయపడి మాతో భాగస్థులు కావలెనని ఆశించుచున్నాము. క్రమముగా మీరు ఇచ్చే ఆర్థిక సహకారము ఇతరులకు దేవుని వాక్యాన్ని అందజేయుటకు దోహదపడుతుంది. ప్రభువు మిమ్మును నడిపించిన ప్రకారము ఆల్ పీపుల్స్ చర్చ్‌తో భాగస్వాములు అవ్వండి. మీరు మీ ఆర్థిక సహాయాన్ని చెక్కు/డిమాండు డ్రాఫ్ట్/ మనియార్డరు ద్వారా "All Peoples Church, Bangalore" పేరుతో పంపగలరు.

మీరు మాకు లెటర్ వ్రాసేటప్పుడు ఇతర ప్రచురణలను కొరకు అడుగగలరు. మీ అభిప్రాయములు, ప్రార్థన అవసరతలతో పాటు ఈ పుస్తకం మీకు ఏలా సహాయపడిందో కూడా తెలియపరచండి. ఈ క్రింది చిరునామా ద్వారా మాతో సంప్రదించగలరు :


ALL PEOPLES CHURCH,
370, 11th Cross, 2nd Block,
R.T. Nagar, Bangalore-560 032
Karnataka, India.

Phone : 91-80 2354 4328
Email: contact@apcwo.org
Website: www.apcwo.org